

# నాకు నచ్చిన నా కథ

'యువ' ప్రవేశపెట్టిన ఈ శీర్షిక - రచయిత లందరికీ - ఓ స్పీడ్ బ్రేకర్' వంటిదని నేను భావిస్తున్నాను. అంటే, రచయితలంతా కథలు రాయటం ఆపేయాలనీ - ఆపేస్తారనీకాదు....కానీ, రాసే వాటిలో ఎన్నిమంచి కథలు ఉన్నాయో - వుంటున్నాయో ఒక్కసారి పునర్విమర్శ చేసుకునే సదవకాశాన్ని కల్పించి తద్వారా రచయితల ఆలోచనా సరళికీ- మనోభావాలకీ కొంచెం పదును పెట్టి - భవిష్యత్తులో వారిచేత, 'మంచి' కథలు రాయించటంలో - ఈ శీర్షిక వెన్నుతట్టి నిలుస్తుందని నా వుద్దేశ్యం!....

నా మొదటి కథ 'హంసగమన'- 1961లో అచ్చయింది.... ఆ కథకు శ్రీ బాపు బొమ్మవేశారు.... అప్పటినుంచీ నిన్నమొన్నటిదాకా దాదాపు 80 కథలు రాశాను.... అయిదు నవలలు కూడా వచ్చాయి.... వృత్తిరీత్యా ఆకాశవాణికి ఎన్నో నాటికలూ, నాటకాలూ, రూపకాలూ, కథలూ, వ్యాసాలూ రాశాను.... ఆదివారాల్లో ప్రసారమయ్యే కార్మికుల కార్యక్రమానికి కావలసిన ప్రచారంతో బాటు మరి కొంచెం హాస్యాన్ని కూడా జోడించి కబుర్లు రాస్తున్నాను- చాలా సంవత్సరాలుగా !

అయితే, ఇవాళ, ఈ శీర్షికక్రింద- నాకు నచ్చిన కథ 'ఇదీ' అని వుత్సాహంగా సగర్వంగా చెప్పుకుందామని వెనక్కి- తిరిగి చూసుకుంటే- భయమూ, అసంతృప్తి కూడా వెంటాడుతున్నాయి....ఏ కథ తీసుకున్నా 'ఇది బాగాలేదేమో' అనే అసంతృప్తి- 'ఇంత కంటే మంచి కథ మరి రాయలేనేమో ?' - అనే భయం !....

అందుకే ఈ శీర్షిక 'స్పీడ్ బ్రేకర్' వంటిదని పేర్కొనవలసి వచ్చింది....

రచయిత ఓ రకంగా చాలా అదృష్టవంతుడు. వయసు వచ్చేకొద్దీ అతని మేధస్సు వికసిస్తుందే కానీ- దాని శక్తి క్షీణించదు.... జీవితాంతం, చనిపోయే చివరి నిమిషందాకా తన రంగంలో తాను కృషిచేయగలుగుతాడు.... ఎన్నో

రచనల్ని సృష్టించగలుగుతాడు.... ఏరకుంటే- అందులో ఒక్కటంటే ఒక్క- టైనా మణిపూసవంటి రచన దొరక్కపోతుందా?.... అలా దొరికిననాడు ఆ రచయిత - చనిపోయిన తర్వాత కూడా జీవించగలుగుతాడు- పాఠకుల హృదయాల్లో!

అలాంటి కథ నేనింతవరకూ రాయలేదు.... కానీ నేను రాసిన అన్ని కథల లోనూ నాకు ఎప్పుడైనా గుర్తుకొచ్చే కథ- "వంశానుగతం!" ఈ కథ రాసి ఆరేళ్లు దాటింది.... పాఠకులు ఈ కథను చదివి- కొంచమైనా 'ఫీ'లయితే- 'ఇది బాగుంది' అని చెప్పే సాహసం చేయగలుగుతాను....

— జీడిగుంట రామచంద్రమూర్తి

# వంశానుగతం

మళ్లీ మరోసారి మెలకువ వచ్చింది....

ఆ రాత్రి అలా మెలకువ రావటం అప్పుడే అది మూడోసారి.... పక్కనే వున్న మరో మంచమీద జానకి నిద్రపోతోంది.

అదృష్టమంటే జానకిది.... ప్రతి విషయాన్నీ తేలిగ్గా తీసుకుంటుంది. దేన్ని గురించీ ఎక్కువ ఆలోచించదు. అందుకే అంత హాయిగా నిద్రపోగలుగుతోంది.

కిటికీలోంచి వెన్నెల గదిలో పరచుకుంటోంది....

లేచివెళ్లి కిటికీదగ్గర నిలబడ్డాను....

పెరట్లో వున్న మొక్కలు తలలు వంచి నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి.... ఆ మొక్కలన్నింటినీ కాపాడే రక్షకభటునిలా నిలబడివుంది వేపచెట్టు!....

ఆ వేపచెట్టు వయస్సు ఇరవై ఏళ్లు!

నాన్న పోయికూడా అప్పుడే ఇరవై ఏళ్లయింది!....

బహుశా నాన్నకూడా, ఇలా నిద్రరాని రాత్రులు ఎన్నో గడిపి వుండాలి. జీవితంలో ఎంతగానో అలసిపోయుండాలి.... కానీ ఆయన కళ్లల్లో నేనెప్పుడూ అలసటని చూసిన జ్ఞాపకంలేదు...

నాకు గుర్తున్నదల్లా ఒక్కటే!

"నువ్ పెద్దవాడివై ఇల్లు కట్టిస్తే- నా చివరి రోజుల్లో- ఆ యింట్లోనే హాయిగా గడుపుతాను!"- అంటూ నా చింపిరితలలోకి తన వేళ్లు పోనిచ్చి నన్ను

తన గుండెలమీదకు లాక్కొని- ముద్దుపెట్టుకుంటూ అన్నమాట !.... ఆ మాటే నా కిప్పటికీ గుర్తుండిపోయింది ...

తాను పోగొట్టుకున్న సర్వస్వాన్నీ తిరిగిపొందుతున్న అనుభూతి వుంది ఆ మాటలో... ! ఆస్తిపాస్తు లివ్వలేకపోయినా అకాశమంత అప్యాయతను పంచు తున్న 'తియ్యదనం' వుంది ఆ ముద్దులో!....

అందుకే అది నేనెప్పటికీ మరచిపోను....అసలది మరచి పోగలిగితే- ఇప్పుడు ఇలాంటి పరిస్థితి రాకపోయేది.

ఆ రోజు....!

ఇప్పటి మాట కాదు.... నలభై ఏళ్ళక్రితంనాటి మాట !

అప్పుడు నాకు పదేళ్లు....

ఆ సాయంత్రం— నేను స్కూలునించి ఇంటికి వచ్చేసరికి కొంచెం పొద్దు పోయింది గుమ్మం దగ్గరకు రాగానే - లోపలనుంచి మాటలు వినిపించాయి... నాన్న ఎవరితోనో మాట్లాడుతున్నారు....నేను గుమ్మందగ్గిరే నిలబడిపోయాను ఆ మాటలు వింటూ !

"చూడండి కేశవయ్యగారూ ! ఇంతకాలం ఎలాగో ఆగేరు....మరొక్క రెండేళ్లు ఓపికపట్టండి.... నేను రిటైర్ కాగానే నా ప్రావిడెంటు ఫండు తాలూకు డబ్బు నాకు తిరిగివస్తుంది.... అప్పుడు మీ బాకీ అణాపైసల్తో తీర్చేస్తాను... "

అంటే....?

నాన్న కేశవయ్యగారికి బాకీ వున్నారన్నమాట !....ఎంతో ?....

"మీ ఇంటి చుట్టూ ఎన్నిసార్లు తిరగమంటావయ్యా ?.... ఎన్నిసార్లు నోటు తిరగరాయమంటావ్ ?.... ఒకటా ?.... రెండా ? ... ఎనిమిదివేలు !.... వడ్డీతో పదకొండువేలయింది . . అవతల నా వ్యాపారం కూడా అంతంతమాత్రంగానే వుంటోంది...." - కేశవయ్య అంత గట్టిగానూ, ధీమాగానూ మాట్లాడుతూంటే ఆ క్షణాన నాకప్పుడు మా హెడ్ మేస్టారు గుర్తుకొచ్చారు.... ఆయనంటే మా స్కూల్లో పిల్లలందరూ ఎంతో భయపడేవారు అప్పట్లో....

"నిజమే ! మీరన్నది కాదనను ! కానీ నా పరిస్థితి కూడా కొంచెం ఆలోచించండి కేశవయ్యగారూ ! పిల్లలిద్దరి పెళ్లిళ్లూ - ఎలాగో మీ దయవల్ల అయిందని పించి - వాళ్ళని అత్తవారింటికి పంపించాను. ఇంక నాకు బాదరబందీ లేమీలేవు. ఒక్క రెండేళ్లు ఓపికపడితే మీ అప్పు తీర్చకపోను...." —ఆ వయస్సులో నాకంతగా తెలియలేదు కానీ - నాన్నమాటలు దీనంగా వుండి వుండాలి....

గుమ్మం పక్క నేవున్న కిటికీ దగ్గరకు వెళ్లి - లోపలకు చూశాను.

కేశవయ్య ఛివాల్న లేచాడు.

"అయ్యా రాఘవరావ్ గారూ!.... 'నిండా మునిగినవాడికి చలేమిటి'- అన్నట్లు మీరు బాగా మునిగిపోయున్నారు కనుక మీకేం బాధనిపించదు....' తన చేను కౌలుకిచ్చి, తాను మరోచోటకి పాలేరుగా వెళ్లినట్లు - నాకీ అవస్థ ఎందుకు చెప్పండి.... అవతల మా అబ్బాయి మెడిసిన్ ప్యాసయి కూర్చున్నాడు....వాడిచేత సిటీలో 'ప్రాక్టీస్' పెట్టించాలి.... మీరేం చేస్తారో-ఎలా తీరుస్తారో నాకనవసరం! ఒక్క నెలరోజుల్లో నా బాకీ మొత్తం చెల్లు వేయించకపోతే - అనవసరంగా నేను కోర్టుకి వెళ్ళవలసి వస్తుంది.... మీరు మీ మర్యాద నిలుపుకోవటం మంచిది!"- గబగబా చెప్పేసి - అంతకంటే గబగబా వెళ్లిపోయాడు.

అలా వెళ్లిపోతున్న కేశవయ్యను చూడగానే అప్పుడు నాకెంతో కోపంవచ్చింది.

ఆ వెంటనే నాన్న వైపు చూశాను.... నిస్సహాయంగా కుర్చీలో వెనక్కి చేరగిలబడి, రెండు చేతులూ మెడవెనక పెట్టుకుని - కళ్లు మూసుకున్నారు.

లోపలకు నడిచాను.... వంటింట్లో అమ్మ బియ్యంలో రాళ్లు ఏరుతోంది.... అప్పుడు నేను చూడలేదుగానీ - అమ్మ కళ్ళల్లోకూడా కన్నీళ్లు కదిలేవుంటాయి.

ఆ రాత్రి అసలు నేను నిద్రపోలేదు.... కేశవయ్యే నా కళ్ళల్లో నిల్చిపోయాడు.... అతనికి నాన్న ఎందుకు బాకీపడ్డారో?... ఎనిమిది వేలు....వడ్డీతో పదకొండు వేలు!.... బహుశా అక్కయ్యలిద్దరి పెళ్లికీ, కేశవయ్యదగ్గర అప్పు తీసుకుని వుండాలి.... అక్కయ్యలు పుట్టిన చాలా ఏళ్ళకి నేను పుట్టానట!.... అమ్మ అప్పుడప్పుడు అంటూండేది.... అందుకే - 'మా అమ్మకి నేనంటే ఎంతో గారంట!' - ఈ మాట మా పక్కింటి సుబ్బులత్తయ్యగారంటూండేవారు....

పదిరోజులు గడిచేయి.... మా యింటికి ఎవరో రావటం - ఇల్లంతా చూసుకోవటం - నాన్నతో ఏదో మాట్లాడటం - నా కొ్కంచెం వింతగానే అనిపించింది.

ఓ రోజు రాత్రి అన్నంతింటూ అమ్మనడిగేను-

"మనింట్లోకి ఎవరైనా అద్దెకు వస్తున్నారా?" - అని.

"కాదు!.... మనమే మరో ఇంటికి అద్దెకు వెడుతున్నాం" - అని అమ్మ చెప్పలేదు....

అంతమాత్రాన జరగవలసింది జరక్కమానలేదు....

మా ఇల్లు మరెవరికో అమ్ముడయిపోయింది.... కేశవయ్య బాకీ వడ్డీతో సహా చెల్లుబడయిపోయింది.

ఆ ఊళ్లోనే మరో చిన్న ఇంట్లోకి - మా మకాం మారిపోయింది....

మా ఇల్లు ఖాళీచేస్తూంటే అమ్మ పొందిన ఆవేదన అంతా ఇంతా కాదు.... అంతకు ముందురాత్రి నాన్న అసలు నిద్రపోలేదనుకుంటాను - ఆయన కళ్లు చింతనిప్పుల్లా కనిపించాయి...

అంత చిన్న వయసులో - ఎలాంటి అనుబంధాన్నీ పెంచుకోని నాకే - మా ఇల్లు వదిలి మరోచోటికి వెళ్లిపోతూంటే మనసంతా వెలితిగా అయిపోయింది.... అలాంటిది, తన కష్టాన్ని రూపాయలుగా మార్చి - వాటితో ఆ ఇల్లు కట్టి - అందులో ఎన్నో ఏళ్లు అమ్మతో సాహచర్యాన్ని పంచుకున్న నాన్న గుండెలకది రంపపుకోతకాదూ ?....

మేం అద్దెకు తీసుకున్న ఇల్లు చాలా చిన్నది.... మూడే గదులు ! అందులో ఒకటి వంటగది.... తక్కిన రెండు గదుల్లోనూ సామానంతా సర్దేసరికి - మరీ ఇరుకనిపించింది.... అందుకే అనవసరమనిపించిన సామాన్లనన్నింటినీ - కట్టకట్టి అటకమీద పారేశారు.

ఆలా అటకమీద పారేసినవాటిలో - నరసరావుపేట వాలుకుర్చీ కూడా ఒకటి !

ఆ కుర్చీ మా వసారాగదిలో ఎప్పుడూ వాల్చేవుండేది.... పొద్దున్నే లేచి కాలకృత్యాలన్నీ తీర్చుకున్నాక - అందులోనే కూర్చుని పేపరు చదువుకునేవారు నాన్న....

సాయంత్రం స్కూలునుంచి వచ్చాక - అలసిపోయిన శరీరానికి అందులోనే సేదతీర్చేవారు.... అప్పుడప్పుడు - నాన్న ఇంట్లోలేనపుడు - నేనూ అందులోనే పడుకునేవాణ్ణి.... ఎంత హాయిగా వుండేదనీ !....

ఆ వాలుకుర్చీని కూడా కట్టకట్టి అటకమీద వేశారంటే - జీవితంతో నాన్న ఎంతగా రాజీపడ్డారో నా కిప్పుడిప్పుడు అర్థమవుతోంది.... ఏదో ఒకనాడు నేనూ జీవితంతో అలాగే రాజీపడవలసివస్తుందని అప్పుడు నేను అనుకోలేదు.... అందుకే - ఆనాడు నాన్నతో అన్నాను -

"ఈ ఇల్లు మరీ చిన్నదిగావుంది.... మీ కుర్చీవేసుకునేందుకూడా చోటు లేదు....మరో పెద్దఇంటికి వెళ్లిపోదాం నాన్నగారూ !"- అని

భోజనంచేస్తున్న నాన్న-ఒక్క-క్షణంసేపు నా వైపు చూశారు.... ఆ తర్వాత గమ్మత్తుగా నవ్వేశారు.... అది తెచ్చిపెట్టుకున్న నవ్వు !.... లేకపోతే అంత గమ్మత్తుగా వుండదు.... ఆ నవ్వులో నిర్లక్ష్యమే వుందో - నిరాశే వుందో నాకు తెలియలేదు.




ఆ తర్వాత నాన్నకి వక్క-పొడి అందిస్తూ -

"రోజూ మీరు కూర్చునే కుర్చీని కూడా అటకమీద వేసేయటం- మీకంటే వాడికే ఎక్కువ బాధగా వుంది పాపం!" - అంది అమ్మ.

వక్క-పొడి నోట్లో వేసుకుని - నన్ను దగ్గరకు తీసుకున్నారు నాన్న.

"నువ్ పెద్దాడివై ఇల్లు కట్టిస్తే - అందులో నాకో గది ఇద్దువుగాని! ఆ గదిలో వాకుర్చీ వేసుకుని కృష్ణారామా అనుకుంటూ చివరిరోజులు హాయిగా గడిపేస్తాను"- నా చింపిరి తలలోకి తన వేళ్లు పోనిచ్చి - నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ అన్నారు.

తాను పోగొట్టుకున్న సర్వస్వాన్నీ తిరిగిపొందుతున్న అనుభూతి వినిపించింది ఆయన మాటల్లో.... ఆస్తిపాస్తులివ్వలేకపోయినా, ఆకాశమంత ఆప్యాయతను పంచుతున్న తియ్యదనం వుంది ఆ ముద్దులో!

ఆ మాటా - ఆ సంఘటనా, నే నెప్పటికీ మరచిపోలేను.... అందుకే, నాన్న కోరిక తీర్చాలనే పట్టుదల నాలో తిష్టవేసుకుంది.... 'అందమైన ఇల్లు కట్టాలి! ఆ ఇంట్లో నాన్నకోసం - వాలుకుర్చీ - ఎప్పటికీ వాల్చేవుండాలి!'

నేనేం చేస్తున్నా - ఏం చదువుతున్నా - నా ముందు, నాన్న కోరికే కొండంత రూపంతో ప్రత్యక్షమయ్యేది.... నా వయసుతోపాటు అదీ పెరిగి పెద్దదైంది....

రాత్రింబగళ్లు కష్టపడి చదివేను.... 'బిఎస్సీ' ప్యాసయిం తర్వాత మెడిసిన్ చదవాలని ఉబలాటపడ్డాను.... అందుకు కారణం లేకపోలేదు....

అప్పట్లో మాఊళ్లో కృష్ణమాచార్యులుగారని- ఓ డాక్టరుగారుండేవారు. ఎవరినైనా ముందు పరీక్షచేయాలంటే ఆయన అయిదురూపాయలు తీసుకునేవాడట.... ఆ పైన మందులిచ్చినందుకూ, ఇంజక్షన్లు చేసినందుకూ, ఇంటికొచ్చి పేషెంటును చూసినందుకు- వేర్వేరుగా రేట్లు పెట్టి- డబ్బు వసూలు చేసేవాడు... నేనూ ఆయనలా, ఓ డాక్టర్నయితే రెండుచేతులా డబ్బు సంపాదించి- నాన్న కోసం త్వరగా ఇల్లు కట్టేయచ్చు!....

అదీ కారణం....

అయితే- మెడిసన్‌లో సీటుకోసం అప్లైచేసినప్పుడు- 'కోటా' ప్రకారం అందరికీ పంచగా 'నాదాకా రాలేదు' పొమ్మన్నారు.... గత్యంతరం లేక 'బిఇడి' చదివెను ... సైన్సు స్టూండెంటుని కాబట్టి- అదృష్టం కూడా కలిసొచ్చి, ఉద్యోగం కూడా త్వరగానే వచ్చింది.

ఆ వెంటనే ఓ ఇంటివాణ్ణి కావటం, మళ్లీ మరో ఏడాది తిరిగొచ్చేసరికి జానకి ఓ చంటాణ్ణి ఎత్తుకోవటం- వరసగా జరిగిపోయాయి....

అయినా నాన్నమాట నేను మరచిపోలేదు.... రిటైరైన తర్వాత ఆయన నా దగ్గరే వుండేవారు. పెన్షన్ పేరుతో వచ్చే ఎనభై రూపాయలకు సాయంగా నలుగురు పిల్లలకు ట్యూషన్లు చెప్పి మరో ముప్ఫై సంపాదించేవారు.

నేనూ కష్టపడటం నేర్చుకుంటాను.... రెండు మూడు 'పార్ట్‌టైం' ఉద్యోగాలు చూసుకున్నాను. పేపర్లుదిద్దీ, గైడులురాసి, ట్యూషన్లుచెప్పి- డబ్బు కూడబెట్టేను-

అలా ఓ పదేళ్లు ఉద్యోగం వెలగబెట్టింతర్వాత- ఎలాగైతేనేం- చిన్న ఇల్లు కట్టగలిగేను.... ఆ ఇంట్లో నాన్నకోసం ప్రత్యేకంగా ఓ గది!... ఇంటికి 'రాఘవనిలయం' అని నాన్నపేరే పెట్టేను.... ఆయన ఆనందానికి అవధుల్లేకపోయాయి...

గృహప్రవేశం జరిగింది.... నాన్న మనస్సులో చిప్పిలిన ఆనందం- ఆయన వయస్సునికూడా మరపించింది....

ఆ మర్నాడే, మిత్రుల సలహామీద- పెరట్లో రెండు అరటిమొక్కలు, ఓ వేపమొక్క, కొన్ని పూలచెట్లూ నాటించాను....

అప్పుడే నాన్న అన్నారు-

"మనకి వేపమొక్క అనవాయితీ కాదురా!"- అని.

"మొక్కలు వేసుకోవటంలో కూడా ఆనవాయితీలూ, సాంప్రదాయాలూ ఏమిటీ- మూఢనమ్మకాలు కాకపోతే-?"- అనుకున్నాను.

"ఇందులో ఆనవాయితీ ఏమిటి నాన్నా!.... వేపచెట్టు చాలా మంచిది.... ఈ చెట్టుమీదనుంచి వచ్చేగాలి మనల్ని ఆరోగ్యంగా వుంచుతుంది!"- అన్నాను....

నాన్న మరేం బదులు చెప్పలేదు....

కానీ, విచిత్రం!!

ఆ రాత్రి రెండుగంటలవేళ-గుండెల్లో నెప్పిగావుందని-మంచినీళ్లు తాగుతూనే మరోలోకానికి వెళ్లిపోయారు నాన్న!....

వేపమొక్క అచ్చిరాలేదన్నారు కొందరు.... గృహప్రవేశ ముహూర్తం మంచిదికాదని మరికొందరు తీర్మానించారు.... కొత్త ఇల్లు బలి కోరిందని ఇంకొందరనుకున్నారు....

ఏది ఏమయినా- నా బాధమాత్రం ఒక్కటే!

ఇల్లు కట్టించినందుకు నాన్న తృప్తితో మురిసిపోయుండచ్చునేమో గానీ- ఆ వాలుకుర్చీలో, ముచ్చటగా మూడురోజులైనా కూర్చోకుండానే వెళ్లిపోయారు.

ఆ వేపమొక్క నాటివుండకపోతే- నాన్న ఆయువు తీరిపోయేది కాదా?.... ఏమో?....

ఓసారి ఆ వేపచెట్టువైపు విశితంగా చూశాను.... దట్టమైన ఆకులతో బలమైన రెమ్మలతో- నిండుచూలాలిగా కనిపిస్తోంది....

దాని వయస్సు ఇప్పుడు ఇరవై ఏళ్లు!....

నాన్న పోయికూడా ఇరవై ఏళ్లు కావస్తోంది ...

కిటికీలోంచి పడుతున్న వెన్నెలనీడ మరింత పొడుగయింది.... పెరట్లోంచి వీస్తున్న వేపగాలి- కొత్తరకం సువాసనను మోసుకొస్తోంది....

నిద్రరావటంలేదు.... పక్కగదిలో శారదా, రాజూ పడుకున్నారు.... రాజు ఏదో పలవరిస్తున్నాడు.... ఇంట్లోనూ బడిలోనూకూడా వాడు బ్రిలియంట్‌గా వుంటాడు.... చదివేది ఆరోక్లాసే అయినా కాలేజీ స్టూడెంట్‌లా పోజు పెడతాడు.... వాణ్ణి శ్రద్ధగా చదివిస్తే జిల్లాకలక్టరు కావచ్చు.... నాలాగా వాడు జీవితంతో రాజీపడి- బడిపంతులుగానో- 'ఎన్జీవో' గానో బ్రతకటానికి సిద్ధపడకూడదు....

కానీ.... ఎలా?....

అంతకంటేముందు- శారద పెళ్ళిసమస్య- కాళ్ళక్రింద అగ్నిగోళంలా

తయారైంది. 'ఇన్నాళ్లూ ఏదో చదువుతోంది' కదా అని వూరుకున్నాం.... ఇహ తప్పదు మరి!

శారద 'పెద్దమనిషై' అప్పుడే ఆరేళ్ళయింది.... దానికి తెలివితేటలూ అణకువా ఇచ్చిన దేవుడు- అందానివ్వటం మర్చిపోయాడు. తాను అనాకారిననే విషయాన్ని శారదకూడా మర్చిపోయి- ఎక్కువ సమయాన్ని పుస్తకాలు చదవటానికే వెచ్చిస్తోంది.... మొన్ననే ఎమ్మే ప్యాసయింది.... ఉద్యోగంకోసం ప్రయత్నాలు చేస్తోంది....

అంతకంటే ఎక్కువగా కాకపోయినా, కనీసం అంతవరకైనా చదివిన వరుడు కావాలిగా?.... మరి అలాంటివాడు, అనాకారైన శారదను చేసుకునేందుకు సిద్ధపడతాడా?....

పడతాడు!.... అయితే- ఎటొచ్చీ అతని రేటు అతని కివ్వాలి!

ఆలోచిస్తే పెళ్ళికూడా ఓ వ్యాపారమేనేమో అనిపిస్తుంది.... లేకపోతే ఏలూరు సంబంధంవాళ్లు అంత 'వ్యాపారధోరణి' లో మాట్లాడివుండరు.

పెళ్లికొడుకు పేరు ఆనందరావు.... ఫరవాలేదు.... బాగానేవుంటాడు.... 'ఎంకాం' పాసయి జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అంత చదువు చదివినందుకూ, అలాంటి ఉద్యోగం చేస్తున్నందుకూ పదిహేనువేలు కట్నం కావాలట అతగాడికి!.... అప్పుడనుకున్నాను, శారదను చదివించి, తెలివితక్కువ పని చేశానని!....పోతే అమ్మాయి అనాకారి కనక, మరో మూడువేలు అదనం!.... మొత్తం పద్దెనిమిదివేల కట్నం!

డబ్బిచ్చి సుఖాన్ని కొనుక్కోవచ్చునని విన్నానేకానీ- డబ్బుతీసుకుని అనాకారితనాన్నీ అవిటితనాన్నీ మరచిపోవచ్చునని మాత్రం నేనెప్పుడూ విన్లేదు....

శారదకు పెళ్లిచేయక తప్పదు!.... కట్నం ఇవ్వకా తప్పదు!.... కారణం- 'ఆడపిల్ల గుండెలమీద కుంపటి'- అని గుండెగుండెమీదా శిలాక్షరాలతో రాసిన ఈ సమాజంలో నేనూ ఒక మామూలు మనిషిని కనక!

అందుకే నేను ఆ నిర్ణయం తీసుకున్నాను.

ఇల్లు అమ్మాలి!!

ఒకనాడు నాన్న చేసిన పని- నేనిప్పుడు చేయాలి.... తప్పదు! నాన్న తాను చేసిన అప్పు తీర్చటానికి ఇల్లు అమ్మేస్తే-

నేను అప్పుచేయకుండానే- బాధ్యత తీర్చుకునేందుకు- తప్పనిసరిగా అమ్ముకుంటున్నాను....

ఎవరు ఎలా అమ్మినా— పరిస్థితి ఒకటే— ఫలితమూ ఒకటే!

పోసీ- ఇంటిని అమ్మకుండా- తనకాపెట్టి అప్పుతీసుకొస్తే- దానిమీద వడ్డీలకు వడ్డీలు కట్టాలి!.... నాన్న ఎనిమిదివేలు అప్పుతీసుకొచ్చి- వడ్డీతో పదకొండువేలు తీర్చారు!....

అయినా అప్పంటే నాకు చాలా భయం.... అప్పు చేసినవాడికి అన్నం సహించదు.... అప్పున్నవాడికి నిద్రపట్టదు.... తప్పుచేసినవాడిలా తలవంచుకుని తిరగవలసివస్తుంది.... చిన్నప్పుడు మా రామూర్తి మేస్టారు చెప్పేవారు- 'అప్పు నిప్పులాంటిదనీ- అప్పులేనివాడే అందరిలోకీ భాగ్యవంతుడనీ!'

అయినా ఏది శాశ్వతం?....

ఒక లక్ష్యంతో ఆనాడు ఇల్లు కట్టేను.... ఆ లక్ష్యం పూర్తిగా నెరవేరకపోయినా- ఇంట్లో ఇరవై ఏళ్లు కాపురంచేశాం.... బ్రతికినంతకాలం ఇంకెలాగా బ్రతకం!.... అప్పుడు ఎవరేమైతే నాకేం?....

అందుకే ఆ నిర్ణయం తీసుకున్నాను...

తెల్లవారితే 'రాఘవనిలయం' పరాధీనమయిపోతుంది.... అది తల్చుకుంటే— నాకు నిద్రరావటంలేదు....

జానకి ఎంత హాయిగా నిద్రపోతోందీ?....

ఇంతవరకూ ఈ విషయం జానకిక్కూ తెలియనివ్వకుండా జాగ్రత్తపడ్డాను.... రేపు మాత్రం తెలవదా?....

తెలిస్తే జానకి ఏమంటుంది?

"నాకెందుకు చెప్పలేదూ?" అంటూ ముందు కోపంగా అరుస్తుంది....తరవాత మనసుకి నచ్చచెప్పుకుని, ఆ మనసులోనే ఏడుస్తుంది....

మరి శారద ఏమంటుందో?....

"నా పెళ్లికోసం ఈ ఇల్లు అమ్మమని ఎవరేడ్చారూ?.... నేను ఉద్యోగం చేసుకుని నా డబ్బుతో నేనే పెళ్లిచేసుకునేదాన్ని!"— అంటూ గొడవచేస్తుంది....

పాపం.... రాజు!.... నా పరిస్థితిని అర్థంచేసుకోలేక - అయోమయంగా చూస్తాడు...

తెల్లవారితే-'రాఘవనిలయం' లోని అందరిముందూ-నేను దోషిగా నిలబడాలి!

అసలు ఇప్పుడే ఇంట్లో అందర్నీ లేపేసి - అసలు విషయం చెప్పేస్తే!?

అవును!.... అప్పుడు నా మనసుకొంచెం ప్రశాంతత లభించి, కంటికింత కునుకు పడుతుందేమో!?.... నిజానికి ఇది ఇంట్లో అందరి సమస్య!.... దీన్ని పరిష్క-

రించటంలో అందరికీ బాధ్యత వుంది!.... నేనే ఎందుకు బాధపడాలి?.... నా బాధను వాళ్ళ మాత్రం పంచుకోకూడదా?....

తెల్లవారిం తర్వాత-రాఘవనిలయాన్ని కొనుక్కునే పెద్దమనుషులు వస్తారు: అప్పుడైనా జానకి అడుగుతుంది విషయమేమిటని? సంగతి తెల్సుకుని గొడవచేయ వచ్చు కూడా!.... వాళ్ళందరి ముందూ హేళనగామాట్లాడుతుందేమో?....

అందుకే - ఇప్పుడు చెప్పేయటమే మంచిది....

నిద్రపోతున్న జానకిని తట్టి పిలిచాను....

"ఏమిటండీ?"- ఉలిక్కిపడి లేచింది.

"కాసిని మంచినీళ్ళు కావాలి!"-

తీసుకొచ్చింది.... నేను సగం తాగి - తక్కినవి జానకిని తాగమన్నాను.

"జానకీ! నిద్రపట్టటంలేదు!"- అన్నాను, చెప్పబోయే విషయానికి నాందిగా.

"కొంచెం పంచదారనీళ్ళు త్రాగితే నిద్రపడుతుందేమో - ఇవ్వమంటారా?"- అడిగింది.

"వద్దు! కూచో!.... నీతో మాట్లాడాలి!"-

అర్థంకాక - నా వైపు అయోమయంగా చూసింది....

"అమ్మా.... శారదా!.... రేయ్.... రాజూ!"- గట్టిగా పిలిచాను.

"మీకేమన్నా మతిగాని పోయిందా?.... వాళ్ళని నిద్రలేపుతారెందుకూ?"- ఖంగారుగా నా వైపు చూస్తూ అడిగింది జానకి....

అప్పటికే, శారదా, రాజూ లేచి వచ్చారు. వాళ్ళను కూడా మంచంమీద - నా ప్రక్కన కూర్చోమన్నాను....

"అర్జంటుగా ఇరవైవేలు కావాల్సి వచ్చాయి!.... ఎందుకూ, ఏమిటీ అని మీరడగొద్దు.... మనకి 'ఆస్థి' అంటూ ఏదైనా వుందీ అంటే - అది ఈ ఇల్లు ఒక్కటే!.... దీన్ని తనఖాపెట్టి అప్పు తెస్తే - నెలకి మూడువందలైనా వడ్డీ కట్టాల్సి వస్తుంది!.... అప్పు అప్పులా వుండిపోగా - నా జీవితమంతా వడ్డీ కట్టటానికి సరిపోదు.... అందుకే - ఇల్లు అమ్మేస్తున్నాను...."- అందరి ముఖ కవళికల్ని గమనిస్తూ చెప్పేను....

రాజూ, శారదా ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.... జానకి మాత్రం గాభరాపడిపోతూ-

"ఇల్లమ్మటం ఏమిటండీ? అసలిప్పుడేం ప్రమాదం వచ్చింది?"- అడిగింది.

"నే నేదో దారుణమైన ప్రమాదంలో ఇరుక్కుని దానినుంచి బయటపడటానికి

ఈ ఇల్లు అమ్మటోవటంలేదు.... అలాగే, నేనేదో అప్పులపాలైపోయి - ఆ అప్పుల్నించి తప్పించుకోవాలనీ కాదు!.... ఆ మాటకొస్తే నిప్పులాంటి అప్పుని గుండెల్లో దాచుకుని - నిమిషనిమిషం నిస్సత్తువగా బ్రతికే బదులు - ఆ అప్పు చేయకుండా వుండాలనే - ఈ నిర్ణయం తీసుకున్నాను.... రేపే మన ఇల్లు అమ్ముడైపోతోంది.... నామీద గౌరవం వుంచి, నా పరిస్థితిని అర్థంచేసుకుంటారని ముందుగా చెబుతున్నాను!"

ఈసారి జానకి మరేం బదులుచెప్పకుండా తలవంచుకుంది.... శారద వైపు చూశాను.... దాని కళ్ళల్లో కన్నీళ్లు!....

"నాకు తెలుసు నాన్నా!.... నా పెళ్ళిచేయటంకోసమే ఈ ఇల్లు అమ్మేస్తున్నావ్.... అంతేగా?"- అంటూ తన ముఖాన్ని చేతుల్లో దాచుకుంది....

ఆ క్షణాన నా కళ్ళల్లోనూ - నీళ్లు తిరిగేయి....

"అవును శారదా! నిన్నో అయ్యచేతిలో పెట్టటం - కన్నందుకు మా బాధ్యత... ఆ బాధ్యత తీర్చుకున్నాననే తృప్తి - అప్పులేదనే సంతృప్తి - ఈ రెండూ - నా మిగిలిన జీవితానికి తోడుగా వస్తాయి.... నా కొచ్చే పెంషన్‌తో ఏ అద్దెఇంట్లోనో హాయిగా వుండగల్గుతాను...."- ఓదార్పుగా అన్నాను.

అంతలోనే రాజు నా దగ్గరగా జరిగేడు....

"పోన్లే నాన్నా! ఇల్లు అమ్మేసి అక్కయ్య పెళ్లి చేసెయ్యండి!.... నేను పెద్దవాడినయ్యాక ఇంతకంటే మంచి ఇల్లు కడతాను.... అందులో నువ్వూ అమ్మా నాతో వుండచ్చు!"- అన్నాడు.

పన్నెండేళ్ల వెందని రాజు అలా అంటూంటే - మళ్లీ మరోసారి నలభైఏళ్ళ క్రితంనాటి గతం గుర్తుకొచ్చింది....

అప్పుడూ నేను ఇలాగే అనుకున్నాను.... కానీ నాన్నలా నేనూ జీవితంతో రాజీపడ్డాను.... నాన్న ఇల్లు కట్టి అమ్మేశారు.... నేనూ ఇల్లు కట్టి అమ్మేశాను..

కొన్ని గుణాలూ, పోలికలూ, ఆలోచనలూ - వంశానుగతంగా వస్తాయంటారు. రాజుకూడా ఇలాంటి పరిస్థితి రాదుకదా?....

'ఇల్లు కట్టటంకంటే - కట్టిన ఇంటిని నిలబెట్టుకోవటమే గొప్ప విషయ' మని చెప్పాలనుకున్నాను రాజుతో....

కానీ.... ఏమీ చెప్పలేక, మూగబాధతో వాణ్ణి దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాను!

అంతే!!

---